సాక్షి నిజామాబాద్

ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



తాత్కాలిక బ్రేక్..

మంజీర నదిలో నుంచి ఇసుక ఓవర్ లోడింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు.

- 8లో ▸



పోలింగ్ కేంద్రాల్లో..

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ హన్మంతు సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.2 /15.7

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

శ్రద్ధానంద్‌గంజ్‌కు వరుస సెలవులు

సుభాష్‌నగర్: మహాశివరాత్రి పురస్కరించుకుని నిజామాబాద్ మర్చంట్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌కు వరుస సెలవులను ప్రకటించినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ అపర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి 28 వరకు ఎలాంటి వ్యాపార లావాదేవీలు జరపబోమని పేర్కొన్నారు. 26న మహాశివరాత్రి, 27న లేబర్ హాలిడే, 28న అమావాస్య కావడంతో గంజ్‌ను బంద్ ఉంచుతున్నట్లు తెలిపారు. మార్చి 1న జనరల్ బిడ్డింగ్ యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. సెలవు రోజుల్లో మార్కెట్‌యార్డునకు రైతులు పంట దిగుబడులను తీసుకురావొద్దని, మార్చి 3 నుంచి పసుపు వ్యాపార లావాదేవీలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

'జిల్లాలో యూరియా కొరత లేదు'

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో యూరియా కొరత లేదని, అవసరమున్న ప్రతి రైతుకు యూరియాను అందిస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. పలు జిల్లాల్లో యూరియా అందుబాటులో లేదన్న వార్తలు రావడంతో డీఏవో స్పందించి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ జిల్లాలో యూరియా కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నామని, అన్ని సొసైటీల్లో నిల్వలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. రైతులు తొందరపడి అవసరానికి మించి యూరియా బస్తాలు కొనుగోలు చేయొద్దని సూచించారు. డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఆగం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీజీ సెట్‌కు ఏర్పాట్లు పూర్తి

డిచ్‌పల్లి: గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించనున్న టీజీ సెట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండలంలోని ధర్మారం(బి), సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్ మాధవిలత, నళిని ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందన్నారు. విద్యార్థులు ఉదయం పరీక్ష సమయానికి గంట ముందుగా హాజరు కావాలని, హాల్ టికెట్‌తో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్, బ్లాక్/ బ్లూ పెన్నులు, పరీక్ష ప్యాడ్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

మరణించి.. జీవిస్తున్నారు



శరీర దాతలు
నర్రా పూర్ణచందర్‌రావు, నర్రా రత్నకుమారి

పోయిన ప్రాణం పునర్జన్మనిస్తోంది

- శరీర, అవయవదానంపై పెరుగుతున్న అవగాహన
- జీవంపోగానే అవయవాల సేకరణ
- ఇప్పటి వరకు 40 మందికి పైగానే శరీరదానాలు
- ఆదర్శంగా నిలుస్తున్న కమ్యూనిస్టులు
- స్వచ్ఛంద సంస్థల ద్వారా సేకరణ

తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ అవయవదాతల కోసం ఎదురు చూస్తున్న వారెందరో.. అలా చీకట్లో మగ్గుతున్న వారికి అవయవదాతలు పునర్జన్మను ప్రసాదిస్తున్నారు. పూవులా రాలిపోయే తమ శరీరం వేరొకరికి పునర్జన్మ ఇవ్వాలని.. ఊపిరి ఆగిపోయిన తరువాత మరొకరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆశిస్తున్నారు. తాము బతికి ఉండగానే 'జీవదాన్' పత్రాలపై సంతకాలు చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. అత్యవసరమైన వారికి తమ శరీరభాగాలు ఉపయోగపడాలని లేదా సమాజానికి ఉపయోగపడే వైద్యవిద్యార్థుల ప్రయోగాలకు తమ శరీరం పనికిరావాలని కోరుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



సండే స్పెషల్

నిజామాబాద్ సిటీ: ఓ వ్యక్తికి పునర్జన్మను ప్రసాదించే అవయవ దానం ఎంతో గొప్పదని భావిస్తున్న రోజులివి. మరణం తర్వాత కూడా జీవించొచ్చు. శ్వాస ఆగినప్పటికీ మన శరీరభాగాలు ఇతరులకు ఉపయోగించొచ్చు. మనకు పనికిరాని అవయవాలను అవసరమున్నవారికి దానం చేసి వారికి పునర్జన్మను ప్రసాదించొచ్చు. ఊపిరి ఆగిన తరువాత గంటల్లో నాశనమయ్యే శరీరం.. అది చక్రవర్తిది అయినా కడుపేదదైనా మట్టిలో కలవాల్సిందే. అటువంటి శరీరాన్ని ఎదుటి వారికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఎంతో మంది అవయవదానం చేసేందుకు ముందుకు వస్తున్నారు. అవయవదానం సామాజిక బాధ్యతగా గుర్తించాల్సిన ఈ సమయంలో ప్రభుత్వాలు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతో ఉంది. శాస్త్రీయ దృక్పథంతో ఆలోచిస్తే ప్రాణంలేని శరీరంతో కూడా కొందరి ప్రాణాలను కాపాడడం లేదా సమాజానికి వైద్య సేవలు అందించే భావి వైద్యుల జ్ఞాన సముపార్జన కోసం ఉపయోగపడేలా చేయడమే విజ్ఞత.

జిల్లాలో అవయవ, శరీరదానాలు

అవయవ, శరీరదానంపై జిల్లాలో అవగాహన అంతంత మాత్రమే. 2013లో తొలిసారి బోధన్‌కు చెందిన మంజులవాణి తల్లి కుసుమవతి శరీరదానం చేశారు. శరీరదానంపై తెలంగాణ బాడీ అండ్ ఆర్గాన్ డొనేషన్ అసోసియేషన్ సంస్థను ప్రభుత్వ టీచర్ కాట్రగడ్డ భారతి నిర్వహిస్తున్నారు. బాడీ డోనర్ మరణించిన వెంటనే సంబంధిత మెడికల్ కళాశాలకు అందజేసే కార్యక్రమాన్ని చేపట్టారు. అవయవ, శరీర దానంపై ఆగస్టులో వారం పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అవయదానం, శరీరదానం ప్రాముఖ్యతను వివరిస్తూ కాట్రగడ్డ భారతి 'వెన్నెల పుష్పాలు' పుస్తకం రాశారు.

ముందువరుసలో కమ్యూనిస్టులు

సమాజ మార్పు కోసం, సమాజంలో నెలకొన్న సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు కమ్యూనిస్టులు పోరాడుతున్నారు. శరీర దానాల్లో కూడా ముందు వరుసలో నిలిచారు. ఇప్పటి వరకు 40 మంది శరీరదానం చేయగా, ఇందులో కమ్యూనిస్టులే ఎక్కువ మంది ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన పలువురు తమ శరీరాలను దానం చేశారు. ఆకుల పాపయ్య తల్లి ఆకుల మల్లవ్వ, అల్లుడు గడ్డం దయానంద్, నీలం సాయిబాబా తల్లి నీలం లక్ష్మి, అక్క నీలం శాంత, కర్నాటి భాస్కరస్వామి తల్లిదండ్రులు కర్నాటి అనసూయ, కర్నాటి యాదగిరి, నర్రా పూర్ణచందర్‌రావు, నర్రా రత్నకుమారి తదితరులు తమ శరీరాలను దానం చేశారు.



కర్నాటి యాదగిరి, కర్నాటి అనసూయ(ఫైల్)

కుటుంబ సభ్యులు అంగీకరించాలి..

అవయవ, శరీర దానం చేసే వ్యక్తి పరిపూర్ణ ఆరోగ్యవంతుడై ఉండాలి. దీర్ఘకాల వ్యాధులు క్యాన్సర్, ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధులున్నవారు అనర్హులు. ఆరోగ్యంగా ఉన్న సమయంలోనే తన మరణం తర్వాత కళ్లు, కిడ్నీలు, గుండె వాటితోపాటు శరీరాన్నికూడా దానం చేస్తున్నట్లు అంగీకరిస్తూ 'జీవదాన్' పత్రంలో సంతకం చేయాలి. డోనర్‌తో పాటు వారి కుటుంబసభ్యులందరి ఆమోదం అవసరం. డోనర్ భాగస్వామితోపాటు సంతానం ఆమోదం తెలుపుతూ సంతకాలు చేయాలి. అప్పుడే సదరు వ్యక్తి శరీర, అవయవదానానికి అర్హులవుతారు.



హక్కుల నేత, సీనియర్ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు శరీరాన్ని మెడికల్ కళాశాలకు అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు



గొర్రెపాటి (ఫైల్)

బ్రెయిన్ డెడ్

కొందరికి ప్రమాదంలోనో, చికిత్సపొందుతూనే బ్రెయిన్ డెడ్ అవుతుంది. క్లినికల్ డెడ్ లేదా బ్రెయిన్ డెడ్ అనేది మెడికల్ భాష. మెదడు తప్ప మిగతా శరీర అవయవాలన్నీ యథావిధిగా పనిచేస్తాయి. మెదడుకు ఆక్సిజన్ సరఫరా నిలిచిపోతే వైద్యులు కృత్రిమ శ్వాస (వెంటిలేటర్‌పై) ఆక్సిజన్) అందిస్తారు. ఆక్సిజన్ తీసివేస్తే ప్రాణం పోతుంది. ఆ వ్యక్తి ప్రాణం పోకముందే కళ్లు, కిడ్నీలు, గుండె, ఊపిరితిత్తులు, కాలేయం తదితర భాగాలను తీసి భద్రపరిచి అవసరమున్న వారికి అమరుస్తారు. శరీరాన్ని కూడా భద్రపరిచి వైద్య విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు ఉపయోగిస్తారు. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులు అనాటమీ (శరీర నిర్మాణశాస్త్రం) శరీర నిర్మాణం, భాగాలు, అవి పని చేసే విధానాన్ని పరిశీలిస్తారు.



శరీర దానం చేసిన కమ్యూనిస్టులు

వైద్య విద్యార్థుల కోసం..

ప్రాణంపోయిన శరీరాన్ని వైద్యులు తీసుకున్న తర్వాత పలు ప్రక్రియలు నిర్వహిస్తారు. శరీరంలోని రక్తాన్ని తీసివేసి రక్తనాళాల్లో కెమికల్స్ ఎక్కిస్తారు. పనికివచ్చే శరీర భాగాలను వేరుచేస్తారు. తర్వాత డెడ్‌బాడీకి ఎంబాల్‌బింగ్ ప్రక్రియ చేసి స్పెషల్ ట్యాంకర్లలో డెడ్‌బాడీలను నిల్వ చేస్తారు. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో అనాటమీ (శరీరనిర్మాణ శాస్త్రం) తరగతుల్లో విద్యార్థులకు బోధిస్తారు. మనిషి శరీరంలోని వివిధ భాగాలు ఎలా పనిచేస్తాయి. వాటి నిర్మాణం, అంతర్గత నిర్మాణం వంటి వాటిని విద్యార్థులకు చూపిస్తారు. దాంతో వైద్య విద్యార్థులు శరీరంలోని అవయవాలు, వాటి పనితీరు, శరీర నిర్మాణం స్వయంగా చూసి నేర్చుకుంటారు. ఒకసారి బాడీని మెడికల్ కళాశాలకు డొనేట్ చేసిన తర్వాత ఎవరికీ ఎలాంటి హక్కు ఉండదు. మళ్లీ ఆ శరీరాన్ని చూసే అవకాశమూ ఉండదు. చివరికి కుటుంబీకులకు కూడా.

అవగాహన కల్పించాలి



మరణానంతరం తన శరీరం భవిష్యత్ వైద్యులకు ఉపయోగపడాలన్నదే గొర్రెపాటి మాధవరావు ఆశయం. నా భర్త మార్గంలోనే నేనూ నడుస్తున్నాను. నా మరణానంతరం కూడా శరీరం దానం చేసేందుకు అంగీకరించాను. శరీర దానంపై సమాజంలో మరింత అవగాహన పెరగాలి. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పించాలి. – మీనా సహానీ, న్యాయవాది

ప్రభుత్వం ప్రోత్సహించాలి



అవయవదానం, శరీరదానం చేసిన వారి కుటుంబాలను ప్రభుత్వం ప్రోత్సహించాలి. అవయవదానం చేసిన వారికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలి. శరీరదానం చేసినవారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలి. వారి కుటుంబ సభ్యులను స్వాతంత్ర్య దినోత్సవం రోజు సన్మానించాలి. – కాట్రగడ్డ భారతి, తెలంగాణ అవయవదాతల సంఘం అధ్యక్షురాలు

గర్వంగా ఉంది



మా తల్లిదండ్రులు కర్నాటి యాదగిరి, అనసూయ. అమ్మ మరణించిన రెండు వారాలకే నాన్న మరణించారు. వారి శరీరాలను నిజామాబాద్ మెడికల్ కళాశాలకు దానం చేశాం. అలా చేయాలన్నది మా తల్లిదండ్రుల కోరిక. వారిద్దరూ నమ్మిన సిద్ధాంతం కోసం జీవితం చివరివరకు కమ్యూనిస్టులుగా జీవించారు. ఎందరికో ఆదర్శంగా నిలిచారు. కొడుకుగా నాకు గర్వంగా ఉంది. – కర్నాటి భాస్కరస్వామి

ముందస్తు సమాచారం ఇవ్వాలి



అవయవదానం, శరీరదానం చేసిన వారు ముందస్తుగా మెడికల్ కళాశాలకు సమాచారం ఇవ్వాలి. డోనర్ కుటుంబసభ్యుల అనుమతితోనే బాడీని తీసుకుంటాం. బాడీ మళ్లీ చూపించే అవకాశం ఉండదు. వైద్యవిద్యార్థులకు పాఠంగా మాత్రమే ఉపయోగిస్తాం. – డాక్టర్ రవీనాపాల్, అనాటమీ అసోసియేట్ ప్రొఫెసర్

ఐదు కిలోలు మింగేస్తున్నారు

- జొన్న తూకంలో మోసం!
- పసిగట్టిన శ్రీరాంపూర్ రైతులు
- తప్పు చేసినట్లు ఒప్పుకున్న వ్యాపారులు



బాల్కొండ: రైతుల నుంచి జొన్నలు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు ఐదు కిలోల చొప్పున తక్కువ తూకం వేస్తూ మోసానికి పాల్పడుతున్నారు. బాల్కొండ మండలంలోని శ్రీరాంపూర్‌లో బాల్కొండకు చెందిన కొందరు వ్యాపారులు శనివారం జొన్నల తూకం వేశారు. జొన్నలు విక్రయించిన రైతు అక్కడి కాంటాపై తన బరువును చూసుకోగా 59 కిలోలుగా చూపించింది. రెండు రోజుల క్రితం ఆర్మూర్‌లోని ఓ ఆస్పత్రిలో రైతు తన బరువును చూసుకోగా 64 కేజీలు వచ్చిందని.. రెండు రోజుల్లో ఐదు కిలోలు ఎలా తగ్గానని రైతుకు అనుమానం వచ్చింది. వెంటనే మరో రైతును వెంటబెట్టుకొని ఆర్మూర్‌లోని ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ బరువు చూసుకోగా 64 కిలోలు రాగా, ఆయన వెంట వెళ్లిన రైతు బరువు 88 కేజీలు వచ్చింది. మళ్లీ ఇద్దరు రైతులు జొన్నవ్యాపారుల కాంటాపై బరువు చూసుకోగా మొదటి రైతు బరువు 59 కిలోలు, రెండో రైతు బరువు 83 కిలోలు వచ్చింది. దీంతో వ్యాపారులు తమను 5కిలోల చొప్పున దోచుకుంటున్నారని నిర్ధారణకు వచ్చి తిరగబడ్డారు. చేసిన తప్పును ఒప్పుకున్న వ్యాపారులు తూకం పూర్తయిన రైతులకు ఐదు కిలోలతోపాటు అదనంగా మరో ఐదు కిలోల డబ్బులు చెల్లిస్తామని ఒప్పందం చేసుకోవడంతో వదిలేశారు. తేమ శాతం చూసే యంత్రాల్లో కూడా పచ్చి మోసం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బోనస్ ప్రకటించకపోతే కలెక్టరేట్ దిగ్బంధం

- పసుపు పంటకు క్వింటాలుకు రూ.12వేలు ధర ఇవ్వాలి
- పసుపు బోర్డుకు చట్టబద్ధత, కనీస మద్దతు ధర కోసం కేంద్రంపై పోరాటం
- స్పష్టం చేసిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- మార్కెట్‌యార్డులో పసుపు పంట పరిశీలన



నిజామాబాద్ మార్కెట్ యార్డ్‌లో పసుపు కొమ్ములను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కవిత, మాజీ మేయర్ నీతూకిరణ్

సుభాష్‌నగర్: పసుపు పంటకు బోనస్ మార్చి 1 లోపు ప్రకటించకపోతే కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తామని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. శనివారం నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పసుపు పంటను పరిశీలించారు. పసుపు రైతులతో మాట్లాడి వారి కష్టాలు, సమస్యలు, ధరలు, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు. మార్కెట్ యార్డులో వ్యాపారులంతా సిండికేట్‌గా మారి పసుపు ధర తగ్గిస్తున్నారని, నాలుగైదు రోజులు వేచి చూసినా పసుపు కొనడం లేదన్నారు. ఒక రకంగా రైతును బ్లాక్ మెయిల్ చేస్తున్న పరిస్థితి కనిపిస్తోందని, నాణ్యమైన పసుపునకు కూడా ధర రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పసుపునకు క్వింటాలుకు రూ.12 వేల కనీస ధర కల్పిస్తామని ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే కేవలం రూ.8 వేలు మాత్రమే ధర పలుకుతోందని, అయినా కూడా ప్రభుత్వం బోనస్ ఊసెత్తడం లేదని విమర్శించారు. రూ.12 వేల కంటే తక్కువ ధర వచ్చిన రైతులకు మిగతా డబ్బులు తక్షణమే బోనస్ రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేరుకే కేంద్ర ప్రభుత్వం గెజిట్ జారీ చేసి పసుపు బోర్డు ఏర్పాటు చేసిందని, చట్టబద్ధత కల్పించలేదని విమర్శించారు. దీంతో పసుపు ధరలు పడిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. పసుపు బోర్డుకు చట్టబద్ధత ఉంటే బయటి దేశాల నుంచి వచ్చే నాసిరకం పసుపు దిగుమతులు తగ్గుతాయన్నారు. బోర్డుకు చట్టబద్ధత, కనీస మద్దతు ధర కోసం కేంద్రంపై పోరాటం కొనసాగుతూనే ఉంటుందని ప్రకటించారు. దీన స్థితిలో ఉన్న పసుపు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాల్సిందేనన్నారు. వ్యాపారులు రైతులను మోసం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రపోతోందని ధ్వజమెత్తారు. సుప్రీం కోర్టు చివాట్లు, మొట్టికాయలు వేసినా తనపై కామెంట్లు చేస్తున్నారని, తాను ఆయనలా మాట్లాడి తన స్థాయి తగ్గించుకోలేనని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నోరు ఉంది కదా అని ఎలా పడితే అలా మాట్లాడితే కుదరదని హెచ్చరించారు.

ఆమె వెంట మాజీ మేయర్ దండు నీతూకిరణ్, మహిళా నాయకులు గడ్డం సుమనారెడ్డి, విశాలినీరెడ్డి, ముత్యంరెడ్డి, నరేష్ నాయక్, దాదన్నగారి మధుసూదన్, సిర్ప రాజు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులదే విజయం

- తెలంగాణ భవిష్యత్‌ను నిర్దేశించే ఎన్నికలు
- మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆలోచించి ఓటేయాలి
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ అర్వింద్

సుభాష్‌నగర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులదే విజయమని కేంద్ర మంత్రి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఎంపీ అర్వింద్, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్‌తో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం బూత్, మండల, జిల్లా స్థాయిలో నాయకులు, కార్యకర్తలు ఓటర్లను వ్యక్తిగతంగా కలుస్తూ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారని తెలిపారు. కులగణనకు బీజేపీ అనుకూలంగా ఉందని, బీసీ సామాజిక వర్గాన్ని చీల్చే కుట్ర జరుగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. నెల రోజుల్లో సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని, ఆ తర్వాత ప్రజా సమస్యలే ఎజెండాగా ముందుకు సాగుతామని తెలిపారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేనన్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా భవిష్యత్ కార్యాచరణతో ఒంటరిగా ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు.

మండలిలో ప్రశ్నించే వారేరీ..

మండలిలో ప్రశ్నించే వారు కరువయ్యారని, బీజేపీ ఎమ్మెల్సీ ఒక్కరే సమస్యలను లేవనెత్తుతున్నారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్సీలందరూ ఆ పార్టీలోకి వెళ్లారని, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అదే పరిస్థితి నెలకొందన్నారు. గతంలో మండలికి మంత్రులు వచ్చి మాట్లాడాలంటే భయపడే వారని, పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు చెమటలు పట్టించేవారని గుర్తు చేశారు. ఈ ఎన్నికలు తెలంగాణ భవిష్యత్‌ను నిర్దేశించే ఎన్నికలు కానున్నాయన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, ప్రధానకార్యదర్శి న్యాలం రాజు, మాజీ కార్పొరేటర్లు, జిల్లా, రాష్ట్ర పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒరగబెట్టిందేమీ లేదు..

కాంగ్రెస్ ప్రభుత్వ 14 నెలల పాలనలో తెలంగాణ సమాజానికి ఒరగబెట్టిందేమీ లేదని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలు కోసం కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏ ఒక్క గ్యారెంటీ, హామీలు అమలు చేయని కాంగ్రెస్ పనితీరుపై సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ చర్చకు సవాల్ విసరడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

క్లుప్తంగా

తెయూ సీవోఈగా సంపత్‌కుమార్


సంపత్‌కు ఉత్తర్వులు ఇస్తున్న రిజిస్ట్రార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి (కంట్రోలర్)గా ప్రొఫెసర్ కె.సంపత్‌కుమార్‌ను నియమించారు. వీసీ ప్రొఫెసర్ టి. యాదగిరి రావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి శనివారం సాయంత్రం సంపత్‌కుమార్‌కు నియామక ఉత్తర్వులు అందజేశారు. అప్లయిడ్ స్టాటిస్టిక్స్ విభాగం ప్రొఫెసర్ సంపత్‌కుమార్ ప్రస్తుతం తెయూ అడ్మిషన్స్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో అప్లయిడ్ స్టాటిస్టిక్స్ విభాగాధిపతిగా, బీవోఎస్ చైర్మన్‌గా,పీఆర్వోగా, నోడల్ ఆఫీసర్‌గా, కంట్రోలర్‌గా, వైస్ ప్రిన్సిపల్‌గా, పబ్లికేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు. తనపై నమ్మకంతో కంట్రోలర్‌గా నియమించిన వీసీ, రిజిస్ట్రార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా ప్రవీణ్ మామిడాల


ప్రవీణ్‌కు ఉత్తర్వులు ఇస్తున్న రిజిస్ట్రార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా అసోసియేట్ ప్రొఫెసర్ ప్రవీణ్ మామిడాలను నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి శనివారం ఉత్తర్వులు అందజేశారు. ప్రస్తుతం బయోటెక్నాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్ గతంలో హెచ్‌వోడీగా, బీవోఎస్ చైర్మన్‌గా, కంట్రోలర్‌గా, ఫారిన్ రిలేషన్స్, ఐక్యూఏసీ, యూజీసీ విభాగాలకు డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విభాగంలో జాయింట్ సెక్రెటరీగా పనిచేశారు.

మోసగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న బాధితుడు నర్సింహమూర్తి

నిజామాబాద్‌నాగారం: తమను దుబాయ్ పంపిస్తానని రూ.15లక్షలు తీసుకొని నందిపేట్ మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన కస్పా శ్యామ్ భోజన్న మోసం చేశాడని బాధితుడు భూపలి నర్సింహమూర్తి పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాట్లాడారు. మూడేళ్ల కింద విదేశాలకు పంపిస్తానని తనతోపాటు ఐదుగురి వద్ద మొత్తం రూ. 15లక్షలు ముంబాయిలోని లక్ష్మీ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నట్లు తెలిపారు. విదేశాలకు పంపకుండా ఇబ్బందులకు గురిచేస్తూ తప్పించుకొని తిరుగుతున్నాడని పేర్కొన్నారు. అయిలాపూర్ వెళ్లి నిలదీస్తే బెదిరిస్తూ కొట్టడంతో తాము 100కు ఫోన్ చేయగా నందిపేట్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోలీసులు, జిల్లా అధికారులు, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

రేపు ఇసుక వేలం

మాచారెడ్డి : మండలంలోని లచ్చాపేట శివారు వాగు వద్ద ఈ నెల 21న సీజ్ చేసిన పది ట్రాక్టర్ల ఇసుకను ఈ నెల 24న వేలం వేయనున్నట్లు తహసీల్దార్ శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వ్యక్తులు రూ.పదివేలు ధరావతు చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు.

తాత్కాలిక బ్రేక్


ఖండ్‌గాం క్వారీలో ఇసుక తవ్వకాలు నిలిచిపోవడంతో నిర్మానుష్య వాతావరణం

- ఖండ్‌గాం ఇసుక క్వారీలో తవ్వకాల నిలుపుదల
- సబ్ కలెక్టర్ ఆఫీసులో డివిజన్ అధికారుల సమీక్ష
- ఓవర్ లోడ్‌పై కీలక నిర్ణయం
- ఏడు క్యూబిక్ మీటర్లకే అనుమతిచ్చే అవకాశం

బోధన్: మంజీర నదిలో ఇసుక ఓవర్ లోడింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు డివిజన్ స్థాయి అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. టిప్పర్లలో ఇసుక రవాణా 7క్యూబిక్ మీటర్లకు తగ్గించే ప్రతిపాదన చేసినట్లు తెలిసింది. కాగా, ఓవర్ లోడ్ అంశంపై 'సాక్షి'లో వరుసగా ప్రచురితమైన కథనాలకు అధికార యంత్రాంగం స్పందించింది. బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో శనివారం సమీక్షించారు. సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్, ఎంవీఐ శ్రీనివాస్, బోధన్, సాలూర మండలాల తహసీల్దార్లు విఠల్, శశిభూషణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లతోపాటు ప్రధానంగా ఇసుక ఓవర్‌లోడింగ్ అంశంపై చర్చించారు. ఈ ప్రక్రియలో భాగంగానే బోధన్ మండలంలోని ఖండ్‌గాం ఇసుక క్వారీలో తవ్వకాలు, రవాణాను తాత్కాలికంగా నిలిపివేశారు.

7 క్యూబిక్ మీటర్లకు తగ్గింపు!

టిప్పర్లలో 10 క్యూబిక్ మీటర్ల ఇసుకకు బదులుగా ఏడు క్యూబిక్ మీటర్లకే అనుమతిస్తే ఓవర్ లోడింగ్ రవాణాకు చెక్క పెట్టొచ్చని సమీక్షలో చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. టిప్పర్ బాడీకి సమాంతరం ఇసుక లోడింగ్ ఉండాలని, పైన పాలిథిన్ కవర్ కచ్చితంగా కప్పి తీసుకెళ్లాలని సూచనలు రాగా అధికారులు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు స్పష్టమవుతుంది. టిప్పర్లల్లో ఇసుక లోడింగ్ క్రమంలో వ్యాపారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని రెవెన్యూ అధికారులు చెప్పగా.. అవసరమైతే పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేస్తామని ఏసీపీ శ్రీనివాస్ స్పష్టతనిచ్చినట్లు సమాచారం. ఇప్పటికే 10 క్యూబిక్ మీటర్ల ఇసుక కోసం డీడీలు కట్టిన వ్యాపారులకు యథావిధిగా ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వనున్నారు. కాగా, నేడు ఆదివారం సెలవుదినం కావడంతో సోమ, మంగళవారాల్లో ఇసుక క్వారీ మళ్లీ ప్రారంభించే అవకాశం ఉంది. ఈ విషయమై బోధన్ తహసీల్దార్ విఠల్‌ను ఫోన్‌లో సంప్రదించగా టిప్పర్లల్లో ఇసుక ఓవర్ లోడింగ్‌ను నియంత్రించాలని సబ్ కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. ఖండ్‌గాం క్వారీ యథావిధిగా కొనసాగుతుందని వెల్లడించారు.

సమర్థవంతంగా సేవలందించాలి


ముగింపు సమావేశం అనంతరం ఆపద మిత్రలతో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్

- అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్
- ఆపద మిత్రలకు ముగిసిన మొదటి విడత శిక్షణ

నిజామాబాద్‌అర్బన్: విపత్తుల సమయంలో ఆపద మిత్రలు సమర్థవంతంగా సేవలందించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని న్యాక్ భవనంలో శనివారం ఆపద మిత్రల మొదటి విడత శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మరో రెండు దఫాలుగా శిక్షణ అందించి, సుశిక్షితులైన సైనికుల వలే తర్ఫీదునిస్తామన్నారు. తొలి విడత శిక్షణ పూర్తి చేసుకున్న వాలంటీర్లకు త్వరలోనే గుర్తింపు కార్డు, సర్టిఫికెట్లను అందజేస్తామని తెలిపారు. మిగతా రెండు దఫాల శిక్షణ కూడా పూర్తి చేసుకున్న వారికి ఐదు లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని వర్తింపజేస్తారని, సుమారు రూ.10వేల విలువ చేసే విపత్తు నివారణ సహాయ ఉపకరణాలతో కూడిన కిట్ అందజేస్తారని పేర్కొన్నారు. 300 మంది వాలంటీర్లను మూడు బ్యాచ్‌లుగా విభజించి 19 రోజులపాటు వివిధ శాఖల నిపుణులు, స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రయోగాత్మక శిక్షణ అందించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ విపత్తుల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఆర్చరీ ఫెడరేషన్' సమావేశంలో సంజీవరెడ్డి



నిజామాబాద్‌నాగారం: ఢిల్లీలో నిర్వహిస్తున్న ఆర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సమావేశంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్చరీ అభివృద్ధిపై చర్చించారు. సమావేశంలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆర్చరీ ప్రధాన కార్యదర్శి, ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్ దేవ్, జార్ఖండ్ మాజీ సీఎం అర్జున్ ముండా, ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కోశాధికారి డాక్టర్ జయిరీస్ పాల్, సహా కార్యదర్శి గుంగన్ అబ్రోల్, తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరవింద్ పాల్గొన్నారు.

ఆదివాసీలకు మంచి రోజులు



మోపాల్(నిజామాబాద్‌రూరల్): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జిల్లా గిరిజన ఆదివాసీ నాయకులు శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎంను కలిసి సన్మానించారు. రాష్ట్రంలోని గిరిజన, ఆదివాసీలకు త్వరలోనే మంచి రోజులు రానున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారని నాయకులు పేర్కొన్నారు. గిరిజనుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లగా, సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సీఎంని కలిసిన వారిలో కాంగ్రెస్ గిరిజ న, ఆదివాసీ జిల్లా చైర్మన్ కెతావత్ యాదగిరి, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ బదావత్ తారాచంద్,ఏఐబీఎస్‌ఎస్ అధ్యక్షుడు చంద్రునాయక్ ఉన్నారు.

ఇద్దరు యువతులపై లైంగికదాడికి యత్నం!

- మద్యం తాగించిన యువకులు
- తప్పించుకొని రోడ్డుపైకి వచ్చిన యువతి
- పోలీసుల అదుపులో యువకుడు

ఖలీల్‌వాడి: ధర్పల్లి మండలం దుబ్బాక గ్రామ శివారులోని నర్సింహస్వామి దేవాలయం గుట్ట సమీపంలోని అటవీ ప్రాంతంలో నగరానికి చెందిన ఇద్దరు యువతులకు మద్యం తాగించి లైంగికదాడికి యత్నించినట్లు తెలిసింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. నిజామాబాద్ నగరానికి చెందిన ఇద్దరు యువతులను దుబ్బాక పరిసర తండాలకు చెందిన నలుగురు యువకులు కారులో తీసుకొచ్చారు. వీరంతా కలిసి అటవీ ప్రాంతంలో మద్యం సేవించారు. అనంతరం మత్తులో ఉన్న ఇద్దరు యువతులపై లైంగికదాడికి యత్నించగా ఓ యువతి తప్పించుకొని రోడ్డుపైకి వచ్చింది. ఓ వాహనాదారుడు కనిపించడంతో విషయం చెప్పగా.. ఆ యువతిని దుబ్బాకకు తీసుకెళ్లి వివరాలు తెలుసుకున్నారు. గ్రామస్తులు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లగా వారిని చూసి ముగ్గురు యువకులు పరారైనట్లు తెలిసింది. కాగా, ఓ యువకుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. యువతుల నుంచి పోలీసులు స్టేట్‌మెంట్ తీసుకొని నిజామాబాద్ పంపించినట్లు తెలిసింది.

క్రైం కార్నర్

జ్యూస్ అనుకొని పురుగుల మందు తాగిన చిన్నారులు

- వాంతులు చేసుకోవడంతో ఆస్పత్రికి తరలించిన తల్లిదండ్రులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంజన

రామారెడ్డి: చిన్నారులు ఇద్దరు ఆడుకుంటూ వెళ్లి పంట పొలాలకు వినియోగించే పురుగుల మందు సేవించిన ఘటన కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం స్కూల్ తండాలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గంగావత్ సంజన (10), గంగావత్ బిందు (7) అక్కాచెల్లెళ్లు. శనివారం తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లడంతో ఇంటి వద్ద ఆడుకుంటున్న చిన్నారులు పానీయం అనుకుని ఇంట్లో ఉన్న పురుగుల మందును తాగారు. కాసేపటికే ఇంటికి వచ్చిన తల్లిదండ్రుల ముందు ఇద్దరు వాంతులు చేసుకున్నారు. గమనించిన తండ్రి గంగావతి మంత్ ఏమైందని పెద్ద కూతురును ప్రశ్నించగా తాము తాగిన డబ్బాను చూపించింది. ఏడేళ్ల బిందుకు మాటలు రావు. వెంటనే 108 కు కాల్ చేసి కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చిన్నారులను తరలించారు. చిన్నకూతురు బిందు పరిస్థితి విషమంగా ఉందని తండా వాసులు తెలిపారు. స్కూల్ తండా ప్రాథమిక పాఠశాలలో సంజన 6వ తరగతి చదువుతోంది.

పెళ్లికి వెళ్లి వచ్చేసరికి దోచేశారు

ఖలీల్‌వాడి: పెళ్లికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగిన ఘటన నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హబీబ్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన కథనం ప్రకారం.. మహ్మద్ మోసిన్ కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి తాళం వేసి మహారాష్ట్రలోని బంధువుల పెళ్లి వెళ్లారు. రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న సుమారు నాలుగు తులాల బంగారం, 300 గ్రాముల వెండి, నగదును ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కారు బోల్తా.. ఆరుగురికి తీవ్రగాయాలు

భిక్కనూరు: మండల కేంద్ర సమీపంలో శనివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. బెంగళూరుకు చెందిన ఆరుగురు వ్యక్తులు కుంభమేళా నుంచి కారులో తిరిగివస్తుండగా భిక్కనూరు వద్ద జాతీయ రహదారిపై బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న ఆరుగురుకి గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి 108 సిబ్బంది ఈఎంటీ యాదగిరి, పైలట్ స్వామి చేరుకొని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి కామారెడ్డికి తరలించారు.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

- బాన్సువాడ యువకుడి మృతి
- వీధిన పడిన కుటుంబం


నక్క సందీప్(ఫైల్)

బాన్సువాడ : తల్లిదండ్రులతోపాటు భార్యాపిల్లలకు జీవితాంతం తోడుగా ఉండాల్సిన ఆ యువకుడిని రోడ్డు ప్రమాదం కబళించింది. బాన్సువాడ పట్టణానికి చెందిన నక్క సందీప్ (30) శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని మేడిపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి తహసీల్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారం రాత్రి తాను ఉంటున్న గదికి వెళ్లే క్రమంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో సందీప్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఏడాదిన్నర కుమార్తె, ఏడు నెలల కుమారుడు ఉన్నాడు. తండ్రి గంగారాంకు కళ్లు సరిగా కనిపించవు. తల్లి మొగులవ్వ వృద్ధురాలు. సందీప్ మరణంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. కాగా, గతంలో బాన్సువాడ వీఆర్‌ఏగా పని చేసిన సందీప్‌ను బదిలీల సమయంలో మేడిపల్లికి రికార్డు అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. సందీప్ మరణవార్త విని బాన్సువాడ, మేడిపల్లిలోని అధికారులు, వీఆర్‌ఏలు శోకసంద్రంలో మునిగారు.

చోరీ కేసులో ఇద్దరు రిమాండ్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని సంగోజివాడి గ్రామంలో ఇటీవల దొంగనానికి పాల్పడిన ఇద్దరు దొంగలను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. సంగోజివాడికి చెందిన దోమకొండ అనిల్, గడ్డం బాలరాజు అనే ఇద్దరు వ్యక్తులు ఈనెల 17, 18తేదీల్లో అదే గ్రామానికి చెందిన గడ్డం రాజవ్వ, గంట రాజశేఖర్, గడ్డం సత్యవ్వ ఇంట్లో చొరబడి చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు గాలింపు చర్యలు చేపట్టి అనిల్, బాలరాజులను శనివారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి 7గ్రాముల బంగారం, 10తులాల వెండి, 300ల నగదు, ఒక సౌండ్‌బాక్స్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఎల్లారెడ్డిలో ఒకరు..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడిన నిందితుడిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. మెదక్ పట్టణానికి చెందిన జ్ఞానసింగ్, మరో ఇద్దరు గుజరాతీ వ్యక్తులు గతేడాది డిసెంబర్ 16న మండలంలోని దేవునిపల్లి కొట్టాల గ్రామాల్లో అర్ధరాత్రి తాళాలు వేసి ఉన్న ఇండ్ల తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసిన పోలీసులు జ్ఞానసింగ్‌ను పట్టుకొని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నాడని పేర్కొన్నారు. నిందితుడి నుంచి 50 తులాల వెండి వస్తువులను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో లోటుపాట్లు ఉండొద్దు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- జక్రాన్‌పల్లిలో పోలింగ్ కేంద్రాల పరిశీలన



జక్రాన్‌పల్లిలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుంతు

జక్రాన్‌పల్లి: శాసనమండలి ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి లోటుపాట్లు ఉండకుండా చూడాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. జక్రాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రం వద్ద ర్యాంప్, టాయిలెట్స్, విద్యుత్ సరఫరా, నీటి వసతి తదితర సదుపాయాలను తెలుసుకున్నారు.

మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల తనిఖీ

మునిపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూంలను పరిశీలించారు. బియ్యం బస్తాలకు ట్యాగ్ లేకపోవడాన్ని గుర్తించిన కలెక్టర్ ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా కేటాయించబడే ప్రతి రైస్‌బ్యాగ్‌కు తప్పనిసరిగా ట్యాగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లై డీఎంను ఫోన్‌లో ఆదేశించారు. వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలకు నాణ్యమైన సన్నబియ్యం సరఫరా చేయాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందిస్తున్నారా ఆరా తీశారు. ఆయన వెంట తహసీల్దార్ కిరణ్మయి, ఆర్ఐ ప్రవీణ్, ఎంపీడీవో సతీశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

లోక కల్యాణార్థమే మహారుద్రాభిషేకం

- హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతీస్వామి
- కేదారేశ్వర ఆశ్రమంలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం


మహారుద్రాభిషేకం చేస్తున్న విద్యారణ్య భారతి స్వామి, మంగిరాములు మహరాజ్

నందిపేట్: లోక కల్యాణార్థం పరమశివునికి మహారుద్రాభిషేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హంపీ పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి పేర్కొన్నారు. నందిపేట మండల కేంద్ర సమీపంలోని శ్రీ కేదారేశ్వర ఆశ్రమంలో శివరాత్రి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్ సమక్షంలో హంపీ పీఠాధిపతి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తయారుచేసిన మట్టి లింగానికి పాంచాహ్నిక దీక్ష విధానంలో లక్షా పదహారు రుద్రాక్షలకు అభిషేకం చేశారు. ఈ సందర్భంగా హంపీ పీఠాధిపతి ప్రసంగిస్తూ పరమశివుడు అభిషేకం ద్వారా ప్రసన్నుడై సమస్త జగత్తులకు కావాల్సిన శుభాలను అనుగ్రహిస్తాడని తెలిపారు. ఈ నెల 27 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. శివరాత్రి రోజు ఆశ్రమంలో లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

మాయ కాదు.. అంతా మ్యాజిక్

- మూఢ నమ్మకాలపై ప్రజల్లో చైతన్యం
- వినోదం, విజ్ఞానాన్ని పంచుతున్న మెజీషియన్లు
- నేడు ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం

మోర్తాడ్(బాల్కొండ): కళ్ల మూసి తెరిచేలోపు కళ్లకు కలిగే భ్రమే ఇంద్రజాలం. గ్లాసులో ఉన్న పాలు తగ్గిపోవడం, ఎన్నిసార్లు తాగిన పాలు గ్లాసు నిండుగానే ఉండటం, నోట్ల వాన కురిపించడం లాంటివి ఎన్నో మ్యాజిక్‌తో సాధ్యమవుతున్నాయి. మూఢ నమ్మకాలతో తమ జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్న వారికి సరైన అవగాహన కల్పించడం, పిల్లలకు వినోదం పంచుతూ విజ్ఞానం అందించడం ఇంద్రజాలికుల ప్రధాన లక్ష్యం. మాయా లేదు, మంత్రం లేదు అంతా మ్యాజిక్కే అంటున్నారు మెజీషియన్‌లు. మంత్రాలు, క్షుద్రపూజలు నమ్మే వారి రుగ్మతను దూరం చేసే కళ మ్యాజిక్‌కే దక్కింది. సమాజాన్ని మేలుకొలిపే దిశగా మెజీషియన్లు తమవంతు కృషి చేస్తున్నారు. నేడు ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

నిజామాబాద్ పట్టాభిరామ్‌గా రంగనాథ్...



నేటితరానికి తెలిసిన ఇంద్రజాలికులలో ప్రథముడు పీసీ సర్కార్(సీనియర్), తెలుగునాట ఈ మ్యాజిక్ కళను పరిచయం చేసింది బీవీ పట్టాభిరాం. నిజామాబాద్ పట్టాభిరామ్‌గా కీర్తి ప్రతిష్టలను ఆర్జిస్తున్నారు జాదు యుగంధర్ రంగనాథ్. రెండు దశాబ్దాలుగా మెజీషియన్‌గా అనేక ప్రదర్శలను ఇచ్చి అందరినీ అలరిస్తూ సమాజాన్ని చైతన్య పరిచేందుకు తనవంతు కృషి చేస్తున్నారు. పీసీ సర్కార్(సీనియర్) జయంతిని పురస్కరించుకొని ఈ నెల 27న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న పీసీ సర్కార్ పురస్కారానికి రంగనాథ్ ఎంపికయ్యారు.

మెజీషియన్లను ప్రోత్సహించాలి



మ్యాజిక్ కళను నమ్ముకున్న వారిని ప్రభుత్వం ప్రోత్సహించాలి. మ్యాజిక్ అనేది విజ్ఞానంతో కూడిన కళ. వర్సిటీల్లో కోర్సును కొనసాగిస్తుండటమే ఇందుకు నిదర్శనం.

– చందన శ్రీనివాస్, నిజామాబాద్

అందరి సహకారంతో ప్రదర్శనలు



అందరి సహకారంతో ప్రదర్శలను ఇస్తున్నాం. మ్యాజిక్‌ను వినోదం కోసం కాదు విజ్ఞాన దృష్టితో చూడాలి. ప్రజలను చైతన్యపరచడం కోసం మావంతు కృషి చేస్తున్నాం.

– జాదు యుగంధర్ రంగనాథ్, ఆర్మూర్


హైడ్రోక్లోరైడ్ ట్యాంకర్ బోల్తా

- యాసిడ్ లీక్‌తో ఇబ్బందులు
- వాహనాల దారి మళ్లింపు


ట్యాంకర్‌పై నీళ్లు చల్లుతున్న అగ్నిమాపక సిబ్బంది

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల కేంద్రంలోని నాగ్‌పూర్ గేట్ సమీపంలో 44వ నెంబరు జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం హైడ్రోక్లోరైడ్ కెమికల్‌ను రవాణా చేస్తున్న ట్యాంకర్ బోల్తాపడింది. ట్యాంకర్ నుంచి హైడ్రోక్లోరైడ్ కెమికల్ లీకేజీ కావడంతో ఘాటైన వాసన పీల్చుకొని స్థానికులు, వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. సమాచారం తెలుసుకున్న డిచ్‌పల్లి ఇన్‌చార్జి సీఐ భిక్షపతి, ఎస్సై ఎండీ షరీఫ్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. డిచ్‌పల్లి నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే వాహనాలను సీఎంసీ మీదుగా దారి మళ్లించారు. తహసీల్దార్ ప్రభాకర్, ఆర్ఐ సంతోష్ చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. జిల్లా కేంద్రం నుంచి అగ్నిమాపక శకటాన్ని తెప్పించి ట్యాంకర్ నుంచి లీకైన కెమికల్ ద్వారా ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టారు. మరో ట్యాంకర్‌ను రప్పించి బోల్తాపడిన ట్యాంకర్ నుంచి హైడ్రోక్లోరైడ్ కెమికల్‌ను నింపారు. ప్రమాదంలో గాయపడిన ట్యాంకర్ డ్రైవర్ ముఖేష్‌ను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యం, అజాగ్రత్తే కారణమని అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నాగిరెడ్డిపేటలో నివాసపు గుడిసె దగ్ధం


అగ్నిప్రమాదంలో దగ్ధమయిన నివాసపు గుడిసె

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామంలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు నివాసపు గుడిసె దగ్ధమైంది. గ్రామంలోని పుల్ల మణెమ్మ తన సోదరి పద్మతో కలిసి నివాసపు గుడిసెలో నిద్రించగా ఆకస్మాత్తుగా పెద్దశబ్దం రావడంతో భయంతో బయటకు పరుగులు తీశారు. గుడిసెకు మంటలు అంటుకోవడంతో స్థానికుల సహాయంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఫైరింజన్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. అగ్ని ప్రమాదంతో బీరువాలో దాచిన రూ.6లక్షల నగదు, తులం బంగారం, 16తులాల వెండిపట్టీలు తదితర సామగ్రి కాలిబూడిదయ్యాయి. నాగిరెడ్డిపేట డీటీ రాజేశ్వర్, జూనియర్ అసిస్టెంట్ సాయిలు శనివారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అడ్లూర్ సబ్‌స్టేషన్‌లో అగ్ని ప్రమాదం


కెపాసిటర్ బ్యాంక్‌లో చెలరేగిన మంటలు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్ సబ్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ ఉపకేంద్రంలోని కెపాసిటర్ బ్యాంక్ విభాగంలో మంటలు చెలరేగడంతో అప్రమత్తమైన సిబ్బంది సరఫరా నిలిపివేశారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. కెపాసిటర్ బ్యాంక్‌లోని సెల్స్ పేలడంతోనే ప్రమాదం జరిగినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ప్రమాద తీవ్రత తక్కువగా ఉండటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.